
# ప్రణవ పద్మాకరం

శ్రీ క్రోధి నామ

## ఉగాది

శుభాకాంక్షలు

ఏప్రిల్ 2024



శ్రీరామ జయ రామ జయ జయ రామ

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక
ఏలూరు

ఏప్రిల్, 2024

# విషయ సూచిక

సంపుటి-3
సంచిక-4



| | | |
|---|---|---|
| 01 | సంపాదకీయం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 03 | శ్రీ గణేశ పురాణం | శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య |
| 04 | శ్రీ వేంకటేశ్వర రహస్యం | శ్రీమతి నిడుముక్కల శ్రీకలి |
| 05 | పురాణంలో మహిళలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 06 | ఐశ్వర్యయోగం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 07 | ఋషిచరిత్ర | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 08 | కాశీ కథలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 09 | స్తోత్రమాలిక | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 10 | గురుదేవుల జీవన కవనము | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |


శ్రీ మహాగణాధిపతయే నమః          శ్రీ గురుభ్యోనమః          శ్రీ మాత్రేనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.




"నేను వైకుంఠాన్ని విడిచి అయినా ఉంటాను కానీ నా భక్తులను మాత్రం విడిచి ఉండలేను" అనేది శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రతిజ్ఞ. స్వామి ఆ ప్రతిజ్ఞను నిలబెట్టుకుంటున్న విధానాన్ని కనులకు కట్టి చూపించే అద్భుత రచన 'శ్రీ వెంకటేశ్వర విలాసం'. స్వామి వారి నివాస స్థలమైన తిరుమల, తిరుమల లోని వివిధ తీర్థములు, వివిధ పర్వతములు, దేవాలయములు, వాటి మహత్తుతో పాటు వాటిని దర్శించవలసిన విధి విధానములు సరళంగా, వివరంగా మనసుకు హత్తుకునే విధంగా వివరించ బడిన ఈ గ్రంథం పఠించిన వారు నిస్సందేహంగా ఆధ్యాత్మిక బల సంపన్నులు కాగలరు.

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:

https://shop.srivaddipartipadmakar.org

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# సంపాదకీయం

## ధర్మాచరణ

'ధర్మం' అంటే ఏమిటి? 'ధర్మంతు సాక్షాత్ భగవత్ ప్రణీతమ్', ధర్మాలన్నియు సాక్షాత్ పరమాత్ముని నుండి లభించాయి. ధరించునదిగాబట్టి ధర్మము అని ధర్మ శబ్దానికి ఉత్పత్తి అర్థము. (ధృ — ధారణే). ధర్మము నిత్యసత్యమై ఉండేదైనప్పటికిని దేశకాలప్రాంతాదుల ననుసరించి ధర్మం మారుతుంటుంది.

శ్లో|| ధృతిః క్షమా దమో స్తేయం, శౌచమింద్రియ నిగ్రహః |
హ్రీర్విద్యాసత్య మక్రోధః ఏతత్ ధర్మస్య లక్షణమ్ ||

అనగా "ధృతి — క్షమ — దమం — అస్తేయం — శౌచం — ఇంద్రియ నిగ్రహం — హ్రీః (సిగ్గు) — విద్య — సత్యం — అక్రోధం", ఈ పది లక్షణాలు కలిగియున్న ధర్మమని శాస్త్రం చెబుతోంది. సుఖంగా జీవించటానికే ధర్మమార్గం అని పేరు. ధర్మాన్ని ఆచరించేవాడు ఎప్పటికీ దుఃఖపడడు. కానీ లోకంలో ధర్మం ఆచరించుచున్నవాడు దుఃఖం అనుభవించటం, అధర్మాన్ని ఆచరించేవాడు సుఖాన్ని అనుభవించడం లోకరీతి. వాస్తవము ఏమిటంటే వాటిని ఆచరించేటువంటి వారికి ధర్మాధర్మములకు ఫలము వెంటనే లభించకపోవచ్చు. ఎప్పుడో చేసిన ధర్మాధర్మములకు ఇప్పుడు ఫలము అనుభవంలోకి రావచ్చు. ఇప్పుడు చేయుచున్న ధర్మాధర్మములకు ఫలము తర్వాత కాలంలో అనుభవంలోకి వస్తుంది. భూమి దున్నిన వెంటనే ఫలము లభించదు. అధర్మం కూడా క్రమముగా ఫలోన్ముఖమై కర్తను సమూలంగా నాశనం చేయును అని మనుధర్మశాస్త్రంలో ఈ శ్లోకమే తార్కాణము.

శ్లో || నాఽధర్మశ్చరితో లోకే సద్యః ఫలతి గౌరివ |
శనై రావర్త్యమానస్తు కర్తుర్మూలాని కృంతతి ||

(మనుధర్మశాస్త్రం 4.172)

సాధకులు అధర్మం త్వరగా ప్రతిఫలిస్తుందని, అధర్మం చేసినవాడు సుఖపడుతున్నాడు అనేటువంటి భావనను మనసులో నుంచి తొలగించాలి. తాత్కాలిక సుఖాన్ని ఆశించి కానీ లేదా దుఃఖాన్ని తప్పించుకోనటానికి గాని మనం అధర్మం చేయరాదు. అధర్మం వల్ల వచ్చే సుఖం కంటే దుఃఖము చాలా అధికంగా ఉంటుంది. ధర్మముతో ఉన్నవాడు దారిద్ర్యముతో బాధపడుతున్నప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోనూ అధర్మానికి పాల్పడరాదు. ధర్మమును వదిలిపెడితే దుఃఖము పోయి సుఖము వస్తుందని భావించరాదు. అధార్మికత వలన కలుగబోవు దుఃఖమును గురించి ఆలోచించవలసినదే తప్ప పొరపాటున కూడా భగవంతుడు నిర్ణయించిన ధర్మభావనను అవలంభించవలెను.ఈ సందర్భంలో ఏది ధర్మము ఏది అధర్మము అనే సంశయం ఉండకూడదు. వేదములు, స్మృతులు, సదాచారములు ఇవన్నీ ధర్మాన్ని నిర్ణయించుకొనటానికి ఆధారం. వీటిని ఎప్పటికీ కూడా ధిక్కరించరాదు. వాటికి వ్యతిరేకంగా ఉండరాదని అదే ధర్మ లక్షణమని ధర్మశాస్త్రం తెలియజేస్తుంది.

శ్లో|| వేదః స్మృతిః సదాచారః స్వస్య చ ప్రియమాత్మనః
ఏతచ్చతుర్విధం ప్రాహుః సాక్షాద్ధర్మస్య లక్షణం

(మనుధర్మశాస్త్రం 2.12)

ధర్మమే మనకు మిత్రుడు. దానిని తప్ప వేరేది దేనిని కూడా నమ్మరాదు. మానవుడు తన పుణ్యమును, తన పాపమును తాను ఒక్కడే అనుభవిస్తున్నాడు. ఇహలోకంలో మన వెంట ఎంతమంది ఉన్నప్పటికీ, పరలోకంలో మనల్ని రక్షించునది కేవలం ధర్మం మాత్రమే. కాబట్టి మానవుడు ఎల్లప్పుడూ కూడా ధర్మమును ఆచరించే ప్రయత్నం చేయవలెను. ధర్మము మానవుడిని ఉద్ధరించుట ఎంత సత్యమో, అధర్మము మానవుని నాశనము చేయటం

కూడా అంతే సత్యం. మరణాంతరం కూడా విడిచిపెట్టకుండా వచ్చేది ధర్మమే. కాబట్టి దానిని వస్తు, వాహనాల కంటే అధికంగానూ, బంధువర్గం కంటే కూడా మిక్కిలిగా ఆచరించదగినది ధర్మం. మోక్ష సాధనకు, జీవిత ఉన్నతికి ధర్మం ఒక్కటే మార్గం, నిరంతర సాధనం. సత్యం వద ధర్మం చర అన్న ప్రణవపీఠ బాటలో సాధకులు ఈ క్రోధి నామ సంవత్సరములో ధర్మాన్ని ఆచరించి తరించుదురు గాక అని అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను.

వద్దిపర్తి పద్మాకర్

## విద్యానిధి వారి ప్రత్యేక వేసవి శిక్షణా తరగతులు

శ్రీ ప్రణవ పీఠం విద్యానిధి వారు పూజ్య గురుదంపతుల ఆశీస్సులతో వేసవి కాలంలో బాల బాలికలకు ప్రత్యేక శిక్షణా శిబిరమును ఏర్పాటు చేసారు.తరగతులు అంతర్జాల వేదిక పై జూమ్ మాధ్యమము ద్వారా నిర్వహించడం జరుగుతుంది.పిల్లలు, వారి తల్లితండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. విద్య అనగా మనలో ఉన్న అంతర్-జ్ఞానాన్ని బయటకు తీయడం .పూజ్య గురుదేవుల దివ్య సంకల్పంతో, శ్రీప్రణవపీఠం-విద్యానిధి అనే కార్యక్రమం ద్వారా తరగతులు ప్రారంభిస్తున్నాము. ఆసక్తి గల వారు ఈ అవకాశమును సద్వినియోగపరచుకోగలరు.

1. Fun Math
2. Indian Geography
3. Mangala Harathi / Desa Bhakthi Songs
4. Raghuvamsha Vrikshamu
5. Pothana Bhagavatham Padyalu
6. Telugu Sathaka Padyalu
7. Yoga Classes
8. Basic Sangeetham
9. Bhagavatham Padyalu
10. Hanuman Chalisa
11. Pancha Upachara Sadhana

ఈ గూగుల్ ఫారం తో రిజిస్టర్ కావలెను.

https://forms.gle/2dG2MY2Vx2kJHa3C9

కోర్సుకి రిజిస్టర్ అయిన విద్యార్థుల తల్లిదండ్రులు Parent's Orientation meeting హాజరు కావలెను. వీటితో పాటు వేదగణితంలో ఉపాధ్యాయులకు కూడా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. మరిన్ని వివరాల కొఱకు సత్సంగంలో చూడగలరు

## శ్రీ రామ జయ రామ జయ జయ రామ

"ఫాల్గుణమాసంలో ఆవు నెయ్యి, ఆవు పెరుగు, తేనె – ఈ మూడింటితో శివలింగాన్ని అభిషేకించిన వారికి తొంబది రోజుల్లో సంపదలు లభిస్తాయి ఫాల్గుణ మాసమును సద్వినియోగం చేసుకొని దుఃఖవిముక్తిని పొందుదాము"

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# శ్రీ గణేశ పురాణం



శివా! నీ శూలం వల్ల నా కొడుకు రొమ్ము చీల్చబడింది. భవిష్యత్తులో నీ కుమారుని తల కూడా తెగిపడుకాక! ఇందులో ఏ అనుమానం లేదు.ఈలోపు బ్రహ్మదులు శివుని ప్రార్థించగా, శివుడు సూర్యుని తిరిగి ఆరోగ్యవంతునిగా చేసి రథంపై కూర్చోపెట్టాడు. కశ్యపుడు శివుని శపించిన విషయం విన్న సూర్యుడు, తండ్రిని మందలించి, ఈశ్వరుడు ఘటనాఘటన సమర్థుడనీ, ఆయనను శపించరాదనీ పలికాడు. అప్పుడు శివుడు విఘ్నేశుని శిరస్సు, గజముఖం కావడానికి ఈ శాపాన్ని తాను స్వీకరిస్తానని పలికాడు. నిజానికి శివుని ఈ శాపాలు ఏమీ చేయలేవు. కేవలం భక్తులను గొప్పవారిని చేయడానికి శాపాన్ని అంగీకరించాడు. మాలి, సుమాలి శివభక్తులు కనుక సూర్య కోపం వల్ల వారికి కలిగిన శ్వేతకుష్ఠరోగం [తెల్లని మచ్చలు కల కుష్ఠ రోగం] తొలగడానికి వారికి సూర్యమంత్రం, సూర్యకవచం, బ్రహ్మదేవుడు అందించి అదృశ్యుడయ్యాడు. వారు పుష్కరక్షేత్రంలో స్నానం చేసి సూర్యుని ఆరాధించి రోగం నుండి విముక్తులయ్యారు. విఘ్నేశునికి విఘ్నంకలిగి శిరస్సు మారడం వెనుక ఉన్న రహస్యం ఇది. ఇది విన్న నారదుడు మరలా నారాయణుని మరొక సందేహం అడిగాడు — జగత్తులలో ఎన్నోరకాల జంతువులున్నాయి. ఎన్నో ప్రాణులు అందమైన ముఖాలతో కనపడుతుంటాయి. ఆ జంతువుల ముఖాలు విడచి ఏనుగు తలనే ఎందుకు గణేశునికి అతికించారు? దీనికి కూడా ఏదైనా కారణం ఉందా?

నారాయణుడు సమాధానం ఇస్తూ అన్నాడు —

శ్లోII గజాస్య యోజనాయాశ్చ కారణం శృణు నారద!
గోప్యం సర్వపురాణేషు వేదేషుచ సుదుర్లభం
తారణం సర్వదుఃఖానాం కారణం సర్వసంపదాం
హారణం విపదాం చైవ, రహస్యం పాపమోచనం
మహాలక్ష్మ్యాశ్చ చరితం, సర్వమంగళమంగళం,
సుఖదం, మోక్షదం చైవ చతుర్వర్గ ఫలప్రదమ్ II

బ్ర.వై.పు.తృ.ఖం.అ.౨౦.శ్లో.5,6,7)

విఘ్నేశునికి ఏనుగు తలనే పెట్టడం వెనుక చాలా విశేషమైన కథ ఉన్నది. పురాణాలన్నింటిలోనూ, వేదాలలోనూ రహస్యంగా ఉన్న కథ అది. అది మహాలక్ష్మీ చరిత్రము. సర్వదుఃఖాలను తొలగిస్తుంది. సమస్త సంపదలనూ ప్రసాదిస్తుంది. ఆపదలను హరిస్తుంది. పాపాలను పోగొడుతుంది. సుఖాలను మోక్షాన్ని ప్రసాదిస్తుంది. ధర్మ, అర్థ, కామ, మోక్షాలనబడే చతుర్విధ ఫలపురుషార్థాలను ప్రసాదిస్తుంది. ఇప్పుడు నేను చెప్పే కథ పద్మకల్పానికి సంబంధించింది. ఒకప్పుడు దేవేంద్రుడు పుష్పభద్రానదీతీరానికి వెళ్ళాడు. తాను త్రిలోకాధిపతిననీ, సంపదలు కలవాడననీ, మహామహిమకలవాడననీ ఆయనకు గర్వం అధికమయ్యింది. ఆ సమయంలో ఆయన చేరుకొన్న పుష్పభద్రానదీతీరంలో ఒక పూలతోట ఉంది. అది పరమసుందరంగా,

...ఇంకా ఉంది

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

## శ్రీ వెంకటాద్రి పై నరసింహస్వామి – శివునితపస్సు



నారదుని ఆశీస్సులు అందుకొన్న దేవదర్శనుడు తన ప్రియ శిష్యుడైన దేవలునితో కలసి తీర్థసేవలు చేసుకొంటూ భూలోక వైకుంఠమైన వెంకటాచలానికి వచ్చాడు. నరసింహస్వామి కొలువై ఉన్న పర్వతంపైకి ఎక్కి శిష్యునితో కలసి భక్తితో స్వామిని దర్శించుకొన్నాడు. అభిషేకం చేసాడు. స్తోత్రాలు పఠించాడు. దేవలునికి ఆ పర్వత మహిమను నరసింహుని పూజించిన మహాత్ముల చరిత్రలు తెలుసుకోవాలనే కోరిక కలిగింది. "గురుదేవా! మనలను తీర్థయాత్రలకు వెళ్ళమని చెప్పిన నారదుడు ఈ కొండపై శ్రీ నరసింహుని శివుడు అర్చించాడని చెప్పాడు. నీలకంఠుడు, సింహకంఠుని పూజించిన దివ్యకథ నాకు వివరించు. వినితరిస్తాను. అని దేవలుడు అడుగగా దేవదర్శనుడు ఇలా అన్నాడు — నాయనా! నారదుని అనుగ్రహంతో ఈ స్థలవిశేషాలన్నీ నాకు తెలుస్తున్నాయి. ఈ పర్వతంపై శ్రీ నారసింహస్వామి నెలవై ఉండటం వల్ల దీనిని కొందరు నృసింహాచలం అని కూడా అంటారు. కృతయుగంలో ప్రహ్లాదుని అనుగ్రహించిన స్వామి దీనిపై అతని కోరికపై స్థిరనివాసం ఏర్పరచుకొని భక్తులను అనుగ్రహిస్తున్నాడు.[మాతృశ్రీ తరిగొండ వేంగమాంబ రచించిన శ్రీ వేంకటాచల మహాత్మ్యంలోని ఈ క్రింది పద్యం పరిశీలిద్దాం —

కII నరసింహుండా దితిసుతు
    నరుదుగ ఖండించి యాచట నా ప్రహ్లాదుం
    గరుణను బ్రోచిన కతమున
    నరసింహాంగిరీంద్రమనెడి నామము కల్గెన్ II

శ్రీ.వేం.మా.ఆశ్వాసం.1.పద్యం.114

నరసింహుడు హిరణ్యకశిపుని సంహరించి, వేంకటాద్రికి వచ్చి ప్రహ్లాదుని అక్కడే కరుణించిన కారణం వల్ల ఆ కొండకు నరసింహగిరి అని కూడా పేరు వచ్చింది. వేంకటాద్రికి ఉన్న అనేక నామాలలో ఇది కూడా ఒకటి అని శ్రీవేంకటాచల మహాత్మ్యంలో వేంగమాంబ వ్రాసింది. దీనికి మూలం పద్మపురాణం, భవిష్యోత్తరపురాణాలలో ఉన్నది]నిజానికి భగవంతునికి గుణరూపకర్మాదులు లేవు. భక్తుల కోసం గుణరూపకర్మములు స్వీకరించి, అనేక నామధేయాలతో, అనేక రూపాలతో, అనేక లీలలతో అనుగ్రహిస్తుంటాడు. అందుకే భాగవతంలో బ్రహ్మ, శివుడు, విష్ణువు, గణపతి, అమ్మవారు - ఇలా అనేక రూపాలతో, అనేక ఆగమశాస్త్ర విధులతో అర్చింపబడే పరబ్రహ్మం ఒకడే అని నారదునికి వివరిస్తాడు. తానే నృసింహరూపంలో, శివరూపంలో ఉండి, తనను తాను అర్చించి,

...ఇంకా ఉంది

*****

# పురాణం లో మహిళలు

## సత్యభామ



నరకాసుర వధలో సత్యభామ పాత్ర గురించి వివిధ కథలు ప్రచారంలో ఉన్నాయి. తెలుగునాట అధిక ప్రచారంలో ఉన్న కథ ప్రకారం నరకాసురుడు తన తల్లి తప్ప వేరొకరిచే మరణం లేకుండా వరం పొందాడట. నరకాసురుడు ఒక రాక్షసరాజు. దానవవంశానికి చెందిన ఘటకాసురుని వధించి ప్రాగ్జ్యోతిష, కామరూప, భౌమ వంశాలను స్థాపించాడు. భూదేవికి ప్రియ పుత్రుడు. నరకాసురుడు కృతయుగంలో వరాహమూర్తి వలన భూదేవికి జన్మించిన వాడు. ఆయన భార్య పేరు మాయ. నరకునకు భగదత్తుడు అనే ఒక కుమారుడు ఉన్నాడు. నరకాసురుడు దేవతలకు తల్లియైన అదితిదేవి కుండలాలనూ, వరుణదేవుని ఛత్రాన్ని, దేవతల మణి పర్వతాన్ని అపహరించాడు. దేవేంద్రుడు శ్రీకృష్ణుడికి నరకుడు చేసే అత్యాచారాలను విన్నవించి సహాయంకోరాడు.ఈ సంగతి తెలిసిన కృష్ణుడు యుద్ధంలో మూర్ఛపోయినట్లు నటించగా, భూదేవి అవతారం అయిన సత్యభామ ధనుస్సు ఎక్కుపెట్టి వదలిన బాణంతో నరకుడు మరణించాడు. మరొక కథ ప్రకారం యుద్ధం చూడాలనే కుతూహలంతో సత్యభామ కృష్ణుని కూడా వెళ్ళింది. కాని కృష్ణుడే చక్రాయుధంతో నరకుని కడతేర్చాడు.శ్రీకృష్ణుని అష్టభార్యలలో సత్యభామ పాత్ర చిత్రణ తెలుగునాట సాహిత్యంలో విశిష్టమైన పాత్ర. నాయిక గాను, సరస శృంగారాభిమానవతిగాను, విభునికి తనపైనున్న ప్రేమకారణంగా గర్వం మూర్తీభవించినదాని గాను సత్యభామ పాత్రను చిత్రీకరించారు. పోతన భాగవతంలో నరకాసుర వధ సందర్భంగా సత్యభామ పాత్రను అందమైన పద్యాలలో చిత్రీకరించాడు. నంది తిమ్మన పారిజాతాపహరణం, కూచిపూడి నాట్యం, భామా కలాపం వంటి వాటిలో సత్యభామ పాత్ర చిత్రీకరణ జరిగింది. నంది తిమ్మన పారిజాతాపహణంలో సత్యభామ పాత్రను చాలా అద్భుతంగా చిత్రీకరించాడు.లోక కంటకుడైన నరకాసురుడిని వధించి, విజయాన్ని సాధించినందుకు ఆనందంతో ప్రజలు దీపాలతో ఇళ్ళను అలంకరించి శ్రీకృష్ణ సత్యభామలకు స్వాగతం చెప్పారు. అప్పటి నుండి నరకాసురుని వధించిన రోజును నరకచతుర్దశి గాను, మరునాడు శ్రీకృష్ణ సత్యభామలు నగర ప్రవేశం చేసిన రోజును దీపావళి గాను మనం పండుగ చేసుకుంటున్నాము.

...ఇంకా ఉంది


*****

# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః | శ్రీ మాత్రేనమః | శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 330 కాదంబరీప్రియా – [ఓం ఐం హ్రీం శ్రీం కాదంబరీప్రియాయై నమః]



కాదంబరి అనగా సరస్వతి. సరస్వతీ దేవిని బాగా ఇష్టపడుతుంది అమ్మవారు. అందువల్ల కాదంబరీప్రియ అయ్యింది. కదంబపుష్పాల నుండి తీసిన మంచి మద్యాన్ని కాదంబరి అంటారు. పూర్వం అడవులలో అమ్మవారికి అమాయకులైన భక్తులు ఈ కాదంబరి అనబడే మద్యం నివేదించేవారు. వారి భక్తికి మెచ్చి ఈ మద్యం స్వీకరించింది కనుక అమ్మకు ఈ పేరు వచ్చింది. ఆడుకోయిలను కూడా కాదంబరి అంటారు. కోకిలను ఇష్టపడుతుంది కనుక కూడా అమ్మకు ఈ పేరు వచ్చింది.


### మంత్రప్రయోగవిధానం – ఫలితం

ఎదుటివారిని ఆకట్టుకొనే వాగ్ధాటి కావాలనుకొనే సాధకులు ఈ మంత్రాన్ని జపించుకోవాలి. అమావాస్య, పూర్ణిమ, రవి సంక్రమణ దినాలలో [అనగా మేషసంక్రమణం, వృషభసంక్రమణం వంటివి. ముఖ్యంగా కర్కాటక, మకరసంక్రమణాలు] ఈ మంత్రాన్ని వేయిసార్లు జపించి కదంబ(కడిమి చెట్టు) పత్రాలు లేక పుష్పాలతో అమ్మవారిని పూజించాలి. చెఱకురసం లేక పానకం నివేదించి ప్రసాదంగా స్వీకరించాలి. పూజించిన పూలు లేక ఆకులను ఎండబెట్టి, బాగా ఎండిన తరువాత పొడిచేసి, ఆ పొడిని, నీళ్ళలో కలిపి స్నానం చేస్తే శత్రువులు మన వశమౌతారు. శత్రుత్వం, మిత్రత్వంగా మారుతుంది

*... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో*

# ఋషి చరిత్ర

## అత్రి మహర్షి



అత్రి ఒక మహాఋషి. ఆయన సప్తఋషులలో ఒకరు. అగ్ని, ఇంద్రుడు, హిందూమతం యొక్క ఇతర దేవతలకు అనేక వేదశ్లోకాలను రచించారు. అత్రి సంహితలు, అత్రి స్మృతులు మొదలగు గ్రంథములను కూడా రచించారు. వీటిలో దానములు, ఆచారములు, గురుప్రశంస, చాతుర్వర్ణ ధర్మములు, జపమాల పవిత్రత, బ్రాహ్మణులకు ఉండవలసిన సుగుణములు, యమ నియమములు, పుత్రులు, దత్తపుత్రులు, ప్రాయశ్చిత్తములు, అశౌచములు

మొదలగు ఎన్నో విషయములు గురించి వివరించారు. హిందూసంప్రదాయంలో సప్తర్షి నక్షత్ర మండలం (ఏడు గొప్ప నక్షత్రాల కూటమి)లో అత్రి ఒక నక్షత్రం. ఈ ఋషి గురించి ఎక్కువగా ఋగ్వేదం గ్రంథంలో ప్రస్తావించబడింది. అత్రి మహామునిననుసరించి ఋగ్వేదంలోని ఐదవ మండలాన్ని అత్రి మండలం అని పిలుస్తారు. అందులోని ఎనభైఏడు శ్లోకాలు ఆయనకు, ఆయన వారసులకు ఆపాదించబడ్డాయి. అత్రి మహర్షి గురించి రామాయణం, మాహాభారత, భాగవత, మార్కండేయ పూరాణాలలో కూడా వివరాలు లభిస్తున్నాయి.పురాణాలప్రకారం, అత్రి, అనసూయ దేవిని వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు కుమారులు, దత్తాత్రేయుడు, దుర్వాసుడు, చంద్ర. అత్రి భార్య అయిన అనసూయ ఏడుగురు పతివ్రతలలో ఒకరిగా పరిగణించబడుతుంది. సంతానమునకై అత్రి తీవ్రమైన తపస్సు చేశాడు. అతని భక్తి, ప్రార్థనలతో సంతోషించిన త్రిమూర్తులు, (బ్రహ్మ, విష్ణు, శివుడు) అతని ముందు ప్రత్యక్షమై అతనికి వరం ప్రసాదించారు. ఆ వరం ప్రకారం త్రిమూర్తులు ముగ్గురూ తనకు పుట్టాలని కోరాడు. భాగవత పురాణ వివరణ ప్రకారం, అనసూయ తన పతివ్రతాశక్తుల ద్వారా ముగ్గురు త్రిమూర్తులను చంటి పిల్లలుగా చేసి వారికి ఆహారం అందించింది. ప్రతిగా వారు ఆమెకు పిల్లలుగా జన్మించారు. బ్రహ్మ ఆమెకు చంద్రునిగా, విష్ణువు దత్తాత్రేయునిగా,శివుడు దూర్వాసునిగా జన్మించారు. అత్రి గురించి ప్రస్తావన వివిధ గ్రంథములలో కనబడుతుంది. అత్రి మహర్షి వివిధ యుగాలతో సంబంధం కలిగి ఉన్నాడు, రామాయణ సమయంలో త్రేతాయుగంలో అత్రి, అనసూయలు రాముడికి, అతని భార్య సీతకు సలహాలు కూడా ఇచ్చారు. అత్రి యొక్క కుటీరం చిత్రకూటంలో ఉంది

...ఇంకా ఉంది

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# కాశీ కథలు



వృద్ధ బ్రాహ్మణ రూపంలో ఉన్న బ్రహ్మ ఓ రాజా! నేను చెప్పితిని కదా ఒక యజ్ఞమును చేయదలిచాను అనెను. అందుకు దివోదాసు మీరు యజ్ఞము చేయుటకు అవసరమైనటువంటి ధనమును వస్తువులను మరియు ఇతర పదార్థములను మా కోశాగారము నుండి తీసుకొని వెళ్ళండి అనెను. ఒక్క యజ్ఞమునకు కాకుండా పది యజ్ఞములకు వృద్ధ బ్రాహ్మణ రూపంలో ఉన్న బ్రహ్మకు సాయం చేసెను. ఒక్క అశ్వమేధ యాగమునకు సహాయము కోరిన బ్రహ్మకు పది అశ్వమేధ యాగములు చేయుటకు అవసరమైన సామగ్రిని దివోదాసు ఇచ్చెను. వీటిని స్వీకరించి బ్రహ్మ రుద్ర సరోవరమునకు చేరెను. రుద్ర సరోవరము వద్ద పది అశ్వమేధ యాగములను బ్రహ్మ చేసెను. ఆ యాగముల వలన వచ్చిన ధూపము ఆకాశము మొత్తము వ్యాపించినది. నాటి నుండే ఆకాశము నీలముగా మారినది అని ఒక నమ్మకం.బ్రహ్మ దశ అశ్వమేధ యాగములు జరిపిన ఈ రుద్ర సరోవరమునకు అప్పటినుండి దశాశ్వమేధ తీర్థము అను పేరు వచ్చినది. బ్రహ్మదేవుడు ఇక్కడనే దశాశ్వమేధేశ్వరుడు అను లింగమును స్థాపించి ఆనాటి నుండి అక్కడే ఉండెను. ఎంత ప్రయత్నించినను బ్రహ్మదేవునికి కూడా దివోదాసు పరిపాలనలో ఒక్క దోషము కూడా కనబడలేదు. శివ కార్యమును పూర్తి చేయలేకపోవడం వల్ల తిరిగి శివుని వద్దకు వెళ్లలేక విశ్వనాథుని రెండవ స్వరూపమైన కాశీ యందే ఉండాలి అని నిశ్చయించెను. ఇందుకు శివుడు ఎన్నటికీ ఆగ్రహించడు అని బ్రహ్మ భావించెను. అనేక జన్మలలో వచ్చు పాపములను నిర్మూలించు కాశీని పొంది కూడా అవివేకులు మాత్రమే వదిలి పెడతారు, అని బ్రహ్మ తలచెను. అప్పటినుండి బ్రహ్మదేవుడు కాశీయందు బ్రహ్మేశ్వర లింగమును స్థాపించి విశ్వనాథుడిని ధ్యానిస్తూ కాశీలో ఉండిపోయెను. కాశీ యందు దశాశ్వమేధ తీర్థము తీర్థ శిరోమణి, ఇక్కడ చేసిన స్నానము, దానము జపము, హోమము, పూజ ఉపాసన, తర్పణ, శ్రాద్ధము పితృకర్మలు అన్నీ కూడా అనంత ఫలితాలను ఇస్తాయి.ఒక్కసారి ఈ తీర్థమునందు స్నానము చేసి దశాశ్వమేధేశ్వరుడిని దర్శించిన వారికి సర్వపాపముల నుండి విముక్తి కలుగుతుంది.జేష్ఠ మాస శుక్లపక్ష పాడ్యమినాడు దశాశ్వమేధ తీర్థమునందు స్నానము చేసిన ఎడల ఒక జన్మలో చేసినటువంటి పాపములు నశిస్తాయి. జ్యేష్ఠ మాసము శుక్ల పాడ్యమి నుండి శుద్ధ దశమి వరకు ప్రతిరోజు స్నానము చేసినవారికి ఎన్ని రోజులు స్నానము చేస్తారో అన్ని జన్మల పాపముల ఫలితము నుండి ముక్తి కలుగుతుంది. దశ హర తిథినాడు దశాశ్వమేధ తీర్థమున స్నానము చేసిన వారికి యముని యాతనలను ఎప్పటికీ చూడరు. దశ హర తిథినాడు దశాశ్వమేధేశ్వరుడిని చూసినచో పది జన్మల పాపము నశించును, ఇక పునర్జన్మ ఉండదు. కాశీలో బ్రహ్మేశ్వరుడిని దర్శించిన వారికి బ్రహ్మలోకమున గౌరవం లభిస్తుంది.

...ఇంకా ఉంది

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# స్తోత్రమాలిక

## శ్రీ శివమానసపూజా స్తోత్రమ్

రత్నైః కల్పితమాసనం హిమజలైః స్నానం చ  దివ్యాంబరం
నానారత్నవిభూషితం మృగమదామోదాంకితం చందనమ్ |
జాతీచంపక బిల్వపత్రరచితం పుష్పం చ ధూపం తథా
దీపం దేవ దయానిధే పశుపతే హృత్కల్పితం గృహ్యతామ్ ||1||

సౌవర్ణే నవరత్నఖణ్డరచితే పాత్రే ఘృతం పాయసం
భక్ష్యం పంచవిధం పయోదధియుతం రంభాఫలం పానకమ్ |
శాకానామయుతం జలం రుచికరం కర్పూరఖణ్డోజ్జ్వలం
తాంబూలం మనసా మయా విరచితం భక్త్యా ప్రభో స్వీకురు ||౨||

ఛత్రం చామరయోర్యుగం వ్యజనకం చాదర్శకం నిర్మలం
వీణాభేరి మృదంగ కాహలకలా గీతం చ నృత్యం తథా |
సాష్టాంగం ప్రణతిః స్తుతిర్బహువిధా హ్యేతత్సమస్తం మయా
సంకల్పేన సమర్పితం తవ విభో పూజాం గృహాణ ప్రభో ||3||

ఆత్మా త్వం గిరిజా మతిః సహచరాః ప్రాణాఃశరీరం గృహం
పూజా తే విషయోపభోగరచనా నిద్రా సమాధిస్థితిః |
సంచారః పదయోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వా గిరో
యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్ ||4||

కరచరణకృతం వాక్కాయజం కర్మజం వా
శ్రవణనయనజం వా మానసం వాఽపరాధమ్ |
విహితమవిహితం వా సర్వమేతత్క్షమస్వ
జయ జయ కరుణాబ్ధే శ్రీ మహాదేవ శంభో ||5||

ఇతి శ్రీమచ్ఛంకరాచార్యవిరచితం శివమానసపూజాస్తోత్రమ్ సమాప్తమ్ ||

*****



ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# గురుదేవుల జీవన కవనము

## షోడశ అధ్యాయము



పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారిని భక్తులు భాగవత కళ్యాణ కృష్ణ గా పిలుచుకుంటారు. గురుదేవుల ప్రవచనములు అన్నీ ఒకవైపున ఉంటే గురుదేవులు చేసిన భాగవత సప్తాహములు అందులో భాగంగా వారు అందించిన భాగవత ప్రవచనములు ఒకవైపుగా నిలుస్తాయి. వారు ప్రవచిస్తూ ఉంటే సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్ముడు తన లీలలను తానే చెప్పుకుంటున్నాడా అన్న విధముగా వారు కృష్ణ లీలలను భక్తులకు అందించారు. ఇప్పటి వరకు 350 కి పైగా భాగవతసప్తాహములను వారు నిర్వహించారు. అనేక పుణ్యక్షేత్రములు,తీర్థములు, నగరములు, పట్టణములతో పాటు ద్వారకా, బృందావనం, మధుర గురువాయూర్ వంటి పవిత్ర కృష్ణ క్షేత్రములలో వారు భాగవత సప్తాహములు నిర్వహించి భాగవతమును ప్రవచించారు. భాగవతములోని ప్రతి కథ అమృతమే. భాగవత కథలను వింటే చాలు మనుషులలో ఉన్న ఆకలి దప్పులన్నీ నశించిపోతాయి. భాగవతము నుండి గురుదేవులు అందించిన గజేంద్రమోక్షణం,ధృవోపాఖ్యానమ, శ్రీకృష్ణ లీలలు, ప్రహ్లాద చరిత్ర, వంటి అనేక భాగవత అంతర్గత కథలను భక్తులు విని ఎంతో పరవసించారు. గురుదేవులు భక్తుల చేత కృష్ణ గీతములను పాడించారు. కేవలం భాగవతము మాత్రమే జనులను రక్షిస్తుంది అని పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు అనేకసార్లు వివరించేవారు. కలియుగం గడిచే కొద్దీ ధర్మం కుంటుపడుతూ వస్తుంది కానీ ఎవరైతే భాగవతాన్ని మాత్రం విడిచి పెట్టకుండా ఉంటారో అటువంటి వారిని కలి ప్రభావము తాకదు. రాబోయే భయంకర రోజులలో అధర్మం పెరిగి, అన్యాయం పెరిగి ధర్మం నశించి, శాస్త్రాలు తిరస్కరించబడతాయి కానీ భాగవతమును నమ్మినటువంటి భక్తులను మాత్రం ఎట్టి కష్టములు దరి చేరకుండా శ్రీకృష్ణ పరమాత్ముడు నిరంతరం కాపాడుతూ ఉంటాడు. భాగవతమే కృష్ణుడు, కృష్ణుడే భాగవతం అయ్యాడు. అందువల్లనే పూజ గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు ఒక్క వారం సమయం అనుకూలం ఉంటే భాగవత సప్తాహమును నిర్వహిస్తారు. ఇందులో వారు ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యునిగా చేస్తున్నారు. ప్రతి భక్తుని పేరిట సంకల్పం చేస్తున్నారు ఇది వారు భక్తులపై చూపిస్తున్న దయ,కరుణ, జాలి. ఏ దేశము వెళ్ళినా గురుదేవులు భాగవత కథలను భక్తులకు పదేపదే చెబుతూ ఉంటారు. వీలున్న చోటల్లా భాగవత సప్తాహం నిర్వహిస్తూనే ఉంటారు. సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్ముడే గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి రూపంలో భక్తులను అనుగ్రహిస్తూ ఉన్నారు.

....ఇంకా ఉంది

*****

# గుడి-బడి

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు ఇచ్చిన పిలుపుతో గురు భక్తులు అందరూ భక్తి తో గుడి-బడి కార్యక్రమం లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమములో భాగముగా భక్తులు వారి ఊరిలోని ఒక మందిరమును శుభ్రపరచి, సంకీర్తనలు పాడి, నామ స్మరణ చేసుకొని సాధ్యమైన మేరకు అన్న దాన కార్యక్రమములు యథా శక్తిగా నిర్వహించడం జరిగింది. హైదరాబాద్, విశాఖపట్టణం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూల్, కడప వంటి అనేక నగరములతో పాటు అనేక గ్రామములలో కూడా ఈ కార్యక్రములను గురుభక్తులు నిర్వహించడం జరిగింది. ప్రముఖ దిన పత్రికలలో కూడా గుడి-బడి కార్యక్రమ వివరాలను అందించారు.

